క్లుప్తంగా

మద్యం దుకాణాల తనిఖీ


పేరుసోముల మద్యం దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎక్సైజ్ అధికారులు

సంజామల: మండల కేంద్రం సంజామల తోపాటు పేరుసోముల, నొస్సం గ్రామాల్లోని ప్రభుత్వ మద్యం దుకాణాలను మంగళవారం ఎక్సైజ్ అధికారులు తనిఖీ చేశారు. క్రాస్ చెకింగ్‌లో భాగంగా ఎక్సైజ్ ఎస్‌ఐ నారాయణ రికార్డులతోపాటు మద్యం స్టాక్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ క్రిష్ణయ్య, కానిస్టేబుళ్లు అయ్యప్ప, కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక


క్రీడాకారులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

డోన్ టౌన్ : రాష్ట్రస్థాయి సీనియర్ సాఫ్ట్ బాల్ పోటీలకు పట్టణానికి చెందిన శ్రీసుధస్కూల్ విద్యార్థులు ఎంపిక అయ్యారు. ఈ మేరకు విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. ఈ నెల 1న కర్నూలులోని మాంటిస్సోరీ స్కూల్‌లో జరిగిన పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని స్కూల్ యాజమాన్యం తెలిపింది. 15వ తేదీ నుంచి ఆళ్లగడ్డలో జరిగే 10వ రాష్ట్ర స్థాయి పోటీల్లో ఈ విద్యార్థులు పాల్గొంటారని ఉపాధ్యాయులు తెలిపారు.

స్పందన, జగనన్నకు చెబుదాం సమస్యలు పరిష్కారం

బేతంచెర్ల: స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో రైతులకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను 80 శాతం పరిష్కరించినట్లు తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి మంగళవారం తెలిపారు. పట్టణానికి చెందిన బొయినపల్లె రామాంజనేయులు, బొయినపల్లె రాజ్ కుమార్,బొయినపల్లె చంద్రమ్మకు సంబంధించి మూడేళ్లుగా నడుస్తున్న తగాదా పరిష్కరించామని తహసీల్దార్ తెలిపారు. ఈ మేరకు వారికి పొలం ఆన్‌లైన్ చేయడమే కాకుండా 1బీలను అందజేశామన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ శ్రీదేవి, వీఆర్వో జయశ్వర్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

అవుకు: మండల కేంద్రం అవుకులోని ఎరువుల దుకాణాలను ఏఓ అబ్దుల్ హక్ మంగళవారం తనిఖీ చేశారు. ఎంసీఎస్ నరసింహులు, శ్రీనివాస ఏజెన్సీ, భవనీ ఫర్టిలైజర్ దుకాణాల్లోని రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయా దుకాణాలకు చెందిన గోడౌన్‌లను తనిఖీ చేసి స్టాక్‌ను పరిశీలించారు. త్వరలోనే ఆర్బీకేల్లో యూరియా అందుబాటులోకి వస్తుందని ఈ సందర్భంగా ఏఓ తెలిపారు.

నంద్యాల ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందజేత

సంజామల: పింఛన్ పంపిణీ మూడవ రోజు మంగళవారం కొనసాగింది. మండల పరిధిలోని ఆకుమల్లకు చెందిన పింఛన్ లబ్ధిదారుడు రామచంద్ర రెడ్డి అనారోగ్యంతో నంద్యాల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు వలంటీర్ గౌరిగారి మంగమ్మ అక్కడికి వెళ్లి పింఛన్ సొమ్ము అందజేశారు. దీంతో లబ్ధిదారుడితోపాటు కుటుంబ సభ్యులు వలంటీర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఎంపీపీ చొరవతో తాగునీటి సమస్య పరిష్కారం

బేతంచెర్ల: మండలపరిధిలోని అంబాపురం గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి చొరవతో తాగునీటి సమస్య పరిష్కారం అయ్యింది. ఎంపీపీ మండల నిధులు కేటాయించడంతో కాలనీకి సరఫరా అయ్యే బోరు బావిలో మోటార్ ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ రాజశేఖర్ తెలిపారు.

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం

డోన్ టౌన్ : ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం అని డిపో మేనేజర్ శశిభూషణ్ అన్నారు. ఇటీవల ప్రవేశ పెట్టిన పోత్సాహక లాటరీలో భాగంగా సెప్టెంబర్ 15 నుంచి 30వ తేదీ వరకు ప్రయాణం చేసిన వ్యక్తుల టిక్కెట్లకు మంగళవారం స్థానిక బస్టాండ్‌లో ప్రజల సమక్షంలో డిప్ తీశారు. మొదటి బహుమతి ఉలిందకొండకు చెందిన నాగార్జున, ద్వితీయ బహుమతి వెల్దుర్తి అల్లాభకాష్, తృతీయ బహుమతి కర్నూలుకు చెందిన దత్తాత్రేయను వరించింది. వీరికి డీఎం ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

ఎన్‌సీసీతో క్రమ శిక్షణ

డోన్ టౌన్ : ఎన్‌సీసీతో విద్యార్థులకు క్రమ శిక్షణతో కూడిన అలవాట్లకు దగ్గరవుతారని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్స్‌పాల్ భారతి, కర్నూలు ఎన్‌సీసీ బెటాలియన్ 28(ఏ) సీటీఓ లక్ష్మయ్య అన్నారు. స్థానిక కళాశాలలో మంగళవారం ఎన్‌సీసీ అభ్యర్థుల ఎంపిక కోసం దేహదారుడ్య పరీక్షలు నిర్వహించారు. మొదటి సంవత్సరంలో నూతనంగా ప్రవేశాలు పొందిన 19 మంది విద్యార్థులు ఎంపికైనట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్స్‌పాల్ వీరాచారి, అధ్యాపకులు లోక్‌రాజు, రజనీదేవి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


సుంకేసులలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు


బనగానపల్లెలో రోగులకు వైద్య సౌకర్యం కల్పిస్తున్న వైద్యాధికారులు


ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ పోచా రమాదేవి

వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు

• ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపును పరిశీలించిన జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: ప్రజలు మెరుగైన వైద్య సేవలు అందజేయడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని తుమ్మలపెంటలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపును జెడ్పీ చైర్మన్ పరిశీలించారు. ఓపీ రిజిష్టర్ నమోదుతో పాటు మందుల పంపిణీ, వైద్యుల పరీక్షలు, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార పదార్థాలతో తయారు చేసిన స్టాల్‌ను పరిశీలించారు. వైద్యులు సుధా ప్రియాంక, జయరాముడు ,వినయ్‌కుమార్, నాగార్జున 480 మందికిపైగా వివిధ రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించారు. అదేవిధంగా ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకం తీసుకొచ్చి ఎంతో మంది పేదలకు ప్రాణం పోశారని గుర్తు చేశారు. తండ్రికి తగ్గ తనయుడుగా సీఎం వైఎస్ జగన్ రెండు అడుగులు ముందు కేసి వైద్యాన్ని గ్రామ స్థాయికి తీసుకొచ్చారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం డబ్ల్యూహెచ్‌ఓ సర్టిఫై చేసిన నాణ్యమైన మందులను పేదలకు అందిస్తుందని గుర్తు చేశారు. గ్రామ స్థాయిలోనే విలేజ్ హెల్త్ క్లీనిక్‌లు ఏర్పాటు చేసి వైద్యాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చిన ఘనత వైఎస్ జగన్‌కు దక్కుతుందన్నారు. బనగానపల్లెలో రూ.23కోట్లతో వంద పడకల ఆసుపత్రి, నంద్యాలలో మెడికల్ కళాశాలతో పాటు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని తీసుకొచ్చారని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లేశ్వరి,ఎంపీడీఓ ప్రసాద్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్ రాజ్‌కుమార్, ఈఓఆర్డీ శ్రీహరి, పంచాయితీ కార్యదర్శి భార్గవిలత, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు పేరం సత్యనారాయణరెడ్డి, నాయకులు తోట మల్లేశ్వరరెడ్డి, యాతం పెద్దిరెడ్డి, లక్ష్మిరెడ్డి, బాలస్వామిరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ మొలక రాజారెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అవుకు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని సుంకేసుల గ్రామం ప్రభుత్వ పాఠశాల ఆవరణలో తహసీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించిన హెల్త్ క్యాంప్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. వైద్య నిపుణులు డాక్టర్లు సుప్రవల్లిక, నవీన్, జనార్దన్, జగదీశ్వర్ రెడ్డి రోగులకు వైద్య పరీక్షలు చేశారు. వివిధ రకాల జబ్బులకు సంబంధించి 430 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అదేవిధంగా ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఇద్దరు ఆర్థోపెడిక్, ఒకరు కార్డియాలజీ, మరొక న్యూరాలజీ పేషంట్‌ను డాక్టర్లు నంద్యాలకు రెఫర్ చేశారు. అనంతరం 16 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర రెడ్డి, ఏఓ వెంకటేశ్వర్లు, ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.


తుమ్మలపెంటలో నిర్వహించిన హెల్త్ క్యాంప్‌నకు తరలివచ్చిన మహిళలు

బనగానపల్లె : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యక్రమంలో హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ ప్రత్యేక వైద్య శిబిరాన్ని పట్టణ సర్పంచ్ ఈసారి యల్లమ్మ, ఎంపీడీఓ శివరామయ్య ప్రారంభించారు. జనరల్ వైద్యులు, శివశంకరుడు, ఫిరోజ్, గైనకాలజిస్టు శ్రీలక్ష్మి, చిన్నపిల్లల వైద్యుడు మంగ్యానాయక్ 400 మందికి వైద్య పరీక్షలు చేశారు. అదేవిధంగా రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరాన్ని నియోజకవర్గ ప్రత్యేక అధికార శ్రీనివాస్ యాదవ్, ఎంపీపీ మానసవీణ పరిశీలించారు. మందుల స్టాక్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎంఈఓ స్వరూప, ఎంఈఓ-1 శ్రీనివాసులు, ఈఓఆర్డీ గురు ప్రసాద్, ఈఓ ఖాలీల్, వార్డు సభ్యులు సురేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఈశ్వర్‌నాయక్, యల్లయ్య పాల్గొన్నారు.


బిజనవేములలో కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ భీమిరెడ్డి రమాదేవి

పల్లెముంగిటకే వైద్య సేవలు

కోవెలకుంట్ల: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పల్లెముంగిటకే వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని ఎంపీపీ భీమిరెడ్డి రమాదేవి అన్నారు. కోవెలకుంట్ల మండలం బిజనవేముల గ్రామ సచివాలయ పరిధిలో మంగళవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎంపీపీ భీమిరెడ్డి రమాదేవి ప్రారంభించారు. గైనకాలజిస్ట్ మేఘన, సివిల్ సర్జన్ నాగరాజు, రేవనూరు, మాయలూరు పీహెచ్‌సీ డాక్టర్ విద్యాసాగర్, అశోక్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 65 మందికి కంటి పరీక్షలు చేయడంతోపాటు గతంలో కంటి పరీక్షలు నిర్వహించిన 27 మందికి కంటి అద్దాలు అందజేశారు. అలాగే 10 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. ఐదుమంది చిన్నారులకు పోషకాహారలోపం ఉన్నట్లు గుర్తించారు. మిగిలిన వారికి సాధారణ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆకుకూరలు, కూరగాయలు, పోషకాలతో కూడిన ఆహార పదార్థాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా, వైద్య రంగాలకు పెద్దపీట వేసిందన్నారు. గతంలో ఏ చిన్న రోగమొచ్చినా చికిత్సల నిమిత్తం నంద్యాల, కర్నూలు, తదితర పట్టణాలకు పరిగెత్తాల్సిన పరిస్థితులు ఉండేవన్నారు. ప్రస్తుతం గ్రామాల్లోనే మెరుగైన వైద్య సేవలందుతున్నాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో వెలగటూరు గ్రామ సర్పంచ్ ఎల్వీ సుధాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు భీమిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి భరోసా

సంజామల: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తుందని ఎంపీపీ పోచా రమాదేవి తెలిపారు. మండల పరిధిలోని ముక్కమల్ల గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని జిల్లా మలేరియా డాక్టర్ కామేశ్వరావు, ముక్కమల్ల సర్పంచ్ రమాదేవి, ఎంపీడీఓ నాగకుమార్, మాజీ సర్పంచ్ పోచా వెంకటరామిరెడ్డి, డాక్టర్లు విద్యాధర్, అరుణ్ కుమార్, సుధా జయంతి, శ్రీకాంత్‌తో కలసి ఎంపీపీ ప్రారంభించారు. డాక్టర్లు విద్యాధర్, అరుణ్ కుమార్, సుధా జయంతి, శ్రీకాంత్ 508 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అదేవిధంగా ఉచితంగా మందులు పంపిణీ చేశారు. నలుగురిని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి సిఫారాసు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పల్లెల ప్రజలకు సైతం మెరుగైన వైద్య సేవలు అందజేస్తుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఎంపీపీ సూచించారు. కార్యక్రమంలో క్యాంప్ సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, యూనిట్ ఆఫీసర్ విశ్వనాథ్, ఈఓఆర్డీ పాపరాయుడు, ఏపీఓ ప్రకాష్ రావు, ఆరోగ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం

డోన్ : ప్రజల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయమని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. పట్టణంలోని జాడీల ఫ్యాక్టరీలోని స్కిల్ ట్రైనింగ్ సెంటర్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని కమిషనర్ వెంకట్రామిరెడ్డితో కలిసి చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో ఎక్కడా లేనివిధంగా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో డాక్టర్లను ఇంటింటికి పంపి ఇంటి వద్దనే ఉచిత వైద్యం అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఆయన తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆరోగ్య శ్రీ, 108, 104 లాంటి పథకాలు అమలుచేయడం ద్వారా ఎందరికో ప్రాణం పోయగా, ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి ఇంటివద్దకే వైద్యసేవలను అందేట్లు చర్యలు తీసుకోవడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు డాక్టర్ రమ్యశిల్ప, డాక్టర్ మధులిక, డాక్టర్ అఖిల్, రాంభూపాల్, కౌన్సిలర్లు మేకల విమల, ఆర్ట్ రమణ, కోఆప్షన్ సభ్యులు రాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

దేవరబండలో

పేదల ఆరోగ్యసంరక్షణ కోసం ప్రభుత్వం అమలుచేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసులు, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, సర్పంచ్ మధుసూధన్‌రెడ్డి సూచించారు. మండలంలోని దేవరబండలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎంపీడీఓ ప్రారంభించారు. అనంతరం డాక్టర్లు ప్రజలకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు అఖిల్, శ్రీకాంత్, హరీష్, వై.రాంభూపాల్, రామతులశమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్యాపిలి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ మారుతి, ఈఓఆర్డీ బాలకృష్ణుడు, వైద్యాధికారి ఇంతియాజ్ ఖాన్ అన్నారు. మండల పరిధిలోని జలదుర్గం గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపు నిర్వహించారు. సర్పంచ్ దస్తగిరి, ఎంపీటీసీ జయరామయ్య తదితరులు మెడికల్ క్యాంపును ప్రారంభించారు. జనరల్ ఫిజిషియన్ రాజ్‌కుమార్ రెడ్డి, చిన్న పిల్లల వైద్యులు కళ్యాణ్ బాబు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు.

బేతంచెర్ల: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రభుత్వం పేదలకు ఆరోగ్య భరోసా కల్పిస్తుందని నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని బుగ్గానిపల్లె గ్రామంలో ఈఓ ఆర్డీ వెంకట రంగనాయక్, సూపరిండెంట్ దస్తగిరి బాబు, కౌన్సిలర్ మధు, బేతంచెర్ల పట్టణంలోని 1, 2 సచివాలయాల పరిధిలో తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, కమిషనర్ రమేష్‌బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని చైర్మన్, వైస్ చైర్మన్ ప్రారంభించారు. వైద్యులు మౌనిక, భార్గవి, షఫీ, స్వప్న, గాయత్రి, రమణమూర్తి, ప్రత్యూష, తస్లీమా, శ్యామ్ కుమార్, ప్రియాంక, రామాంజనేయులు ఆయా వైద్య శిబిరాల్లో రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు, అవసరమైన వారికి కళ్ల అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఇబ్రహీమ్, వైఎస్సార్‌సీపీ నాయకులు సలీమ్, జశ్వంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలోని వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు ప్రత్యూష, తస్లీమా, శ్యామ్ కుమార్, ప్రియాంక, రామాంజనేయులు పెద్దఎత్తున రోగులకు వైద్య పరీక్షలు చేశారు. డాక్టర్లను నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, కమిషనర్ రమేష్ బాబు సన్మానించారు.


డోన్‌లో రోగులకు మందులు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ , కౌన్సిలర్లు


బేతంచెర్లలో వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, నగర పంచాయితీ చైర్మన్


మెడికల్ క్యాంపునకు తరలివచ్చిన మహిళలు

❛ఉచితంగా కళ్ల అద్దాలు ఇచ్చారు



ఇంతకు ముందు కంటి పరీక్ష కోసం కడపకు వెళ్లి చూపించుకున్నా. కొద్ది రోజుల నుంచి సరిగా కనపడటం లేదు. బయటకు వెళ్లలేక కాలం వెళ్లదీస్తున్నా. ఊర్లో వైద్య శిబిరం పెట్టడంతో మళ్లీ కంటి పరీక్ష చేయించుకున్నా. అద్దాలు ఉచితంగా ఇచ్చారు. ఇప్పుడు బాగా కనిపిస్తున్నాయి. చాలా సంతోషంగా ఉంది. బయటకు పోకుండా... పైసా ఖర్చు లేకుండా వైద్య సేవలతోపాటు అద్దాలు ఇవ్వడం అభినందనీయం.

– వెంకటసుబ్బమ్మ, తుమ్మలపెంట

❛మాలాంటోళ్లకు చాలా మేలు



దగ్గు, గళ్ల పడక కొద్ది రోజుల నుంచి ఇబ్బంది పడుతున్నాను. కొలిమిగుండ్లలోని ఓ ప్రవేట్ ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకొని మందులు తెచ్చుకున్నా నయం కాలేదు. రూ.500 పైగానే మందులకు ఖర్చు అయింది. కర్నూలుకు వెళ్లమని చీటి రాసిచ్చారు. ఈలోగా ఊర్లోనే వైద్య శిబిరం పెట్టారు. ఉచితంగా అన్ని వైద్య పరీక్షలతోపాటు మందులు అందజేశారు. చాలా సంతోషంగా ఉంది. మాలాంటి ముసలోళ్లకు ఊర్లో పెట్టడం వల్ల చాలా ఉపయోగపడుతుంది.

– రాముడు, తుమ్మలపెంట

కండరాల నొప్పలకు పరీక్షలు చేశారు...



మా సొంతూరిలో వైద్య శిబిరం నిర్వహించడం సంతోషంగా ఉంది. డాక్టర్లు ఇక్కడికే వచ్చి వైద్య పరీక్షలు చేయడం అభినందనీయం. కండరాల నొప్పులతో బాధ పడుతున్న నాకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గతంలో ఏ ప్రభుత్వ ఇలా గ్రామాలలో వైద్యశిబిరాలు నిర్వహించలేదు. ఇంటి వద్దకు వైద్యం సౌకర్యాలు అందిస్తున్న సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం.

– సుబ్బమ్మ, ముక్కమల్ల

❛వైద్య సేవలు బాగున్నాయి...



జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో డాక్టర్లు అందజేస్తున్న సేవలు చాలా బాగున్నాయి. నాకు బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. అదేవిధంగా ఉచితంగా మందులు అందజేశారు. ప్రజలకు ఈ కార్యక్రమం చాలా ఉపయోగపడుతుంది.

– జైబూన్‌బీ, పేషెంట్, బనగానపల్లె

వృద్ధులకు ఎంతో ఉపయోగకరం



జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం వృద్ధులకు ఎంతో ఉపయోగకరం. కీళ్ల నొప్పులు, గ్యాస్, కంటి సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న నాకు అన్ని పరీక్షలు నిర్వహ/ంచి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఇదే పరీక్షల కోసం జిల్లా ఆసుపత్రికి వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం మా గ్రామంలోనే వైద్య శిబిరం ఏర్పాటు చేసిన సీఎంకు కృతజ్ఞతలు.

– ముద్దవరం లక్ష్మమ్మ, బుగ్గానిపల్లె గ్రామం, బేతంచెర్ల మండలం

❛వైద్య సేవలు అభినందనీయం



ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందజేయడం అభినందనీయం. డెబ్బై ఏళ్ల తనకు కాళ్ల నొప్పులు, కంటి సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నా. వైద్య శిబిరం దగ్గరకు వచ్చినప్పటి నుంచి పరీక్షలు ముగిసేంత వరకు వైద్య సిబ్బంది తోడ్పాటు అభినందనీయం. ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– మద్దయ్య, బుగ్గానిపల్లె గ్రామం, బేతంచెర్ల మండలం

మోడల్ నియోజకవర్గంగా డోన్

• నవ నిర్మాణయాత్రలో భాగంగా అభివృద్ధి పనులు పరిశీలించిన ప్రజాప్రతినిధులు

బేతంచెర్ల: ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మరకు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సారథ్యంలో డోన్‌ను రాష్ట్రంలోనే మోడల్ నియోజకవర్గంగా మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తీర్చిదిద్దుతున్నారని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి స్పష్టం చేశారు. నవనిర్మాణ యాత్రలో భాగంగా మంగళవారం అభివృద్ధి పనులను మండల ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు సందర్శించారు. ముందుగా పాణ్యం మండలంలోని గోరుకల్లు రిజర్వాయర్ నుంచి వాటర్ గ్రిడ్ పథకం కింద రూ. 330 కోట్లతో తాగునీటి సరఫరా పైపులైన్‌ను పరిశీలించారు. బేతంచెర్ల మండలంలోని బుగ్గానిపల్లె తండా గ్రామ సమీపాన 8 ఎకరాల్లో గోరుకల్లు రిజర్వాయర్ నుంచి వచ్చే నీటి స్టోరేజ్, ఫిల్టర్ చేయడానికి చేపట్టిన ట్రీట్‌మెంట్‌ప్లాంట్ నిర్మాణ పనులను పరిశీలించారు. మెగా ప్రాజెక్టు మేనేజర్ వాసు నీటి సామర్థ్యం, శుభ్రత, పంపింగ్ విధానాన్ని నాయకులకు వివరించారు. అనంతరం డోన్ పట్టణంలో 100 పడకల ఆసుపత్రి, ఐటీఐ కళాశాల, ఇండోర్ స్టేడియం, నూతన మున్సిపల్ కార్యాలయం, ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్, అబ్బిరెడ్డి పల్లె చెర్వు, నగర వనాన్ని ప్రజాప్రతినిధులు సందర్శించారు. కార్యక్రమంలో వాల్మీకి ఫెడరేషన్ డైరక్టర్ మురళీకృష్ణ, మద్దిలేటి స్వామి ఆలయ చైర్మన్ రామచంద్రుడు, వైస్ ఎంపీపీ రంగస్వామి, మండల కన్వీనర్ తిరుమలేశ్వర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బాబుల్‌రెడ్డి, బుగ్గన కుమార్ రెడ్డి, నాగరాజు, వెంకటేశ్వర్‌రెడ్డి, బలరాముడు, చలపతిరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, యకోబ్, ఎద్దులన్న, పరమేష్, సర్పంచ్‌లు వెంకటేశ్వర్లు, శ్రీరాములు, రాజు తదితరులు పాల్గొన్నారు.


గోరుకల్లు రిజర్వాయర్ వద్ద మాట్లాడుతున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

బనగానపల్లె : మండలంలోని ఇల్లూరుకొత్తపేట గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పూర్వ విద్యార్థి అప్పాజీ మురళీ మోహన్‌రావు పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం విద్యార్థులకు హెచ్‌ఎం సోమశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్లేట్లు పంపిణీ చేశారు. పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించే విద్యార్థులకు 1987–88 బ్యాచ్ తరుపున ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని పూర్వ విద్యార్థులు వైవీ మల్లారెడ్డి,జి గోపాల్‌రెడ్డి,కె.రామ్ మద్దిలేటిరెడ్డి, కోడినాగేష్ బాబు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుమార్‌బాబు, రామచంద్రారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, పినాకపాణి,సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

హెవీ డ్రైవింగ్ లైసెన్స్‌కు శిక్షణ తప్పనిసరి

డోన్ టౌన్ : హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కోసం 40 రోజుల పాటు శిక్షణ తప్పని సరిగా తీసుకోవాలని డోన్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ అన్నారు. మంగళవారం డ్రైవింగ్ స్కూల్‌ను తనిఖీ చేసి శిక్షణ పొందుతున్న వారికి పలు సూచనలు చేశారు.

బ్రహ్మానంద ఆచారికి శాంతి సేవా రత్న అవార్డు

బనగానపల్లెరూరల్ : మండలంలోని పలుకూరు గ్రామానికి చెందిన జీకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జీఎస్ఎస్ బ్రహ్మానంద ఆచారికి మనం పౌండేషన్ మహాత్మాగాంధీ శాంతి సేవా రత్న అవార్డు అందజేసింది. సోమవారం హైదరాబాద్‌లో మనం పౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి, పౌండేషన్ అధ్యక్షుడు లాయర్ చక్రవర్తి, మా తెలంగాణ అధ్యక్షుడు కిరణ్ తదితర ప్రముఖులు అవార్డు, ప్రశంసా పత్రం అందజేశారని బ్రహ్మానంద ఆచారి తెలిపారు. ఇదే స్పూర్తితో సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తామని ఆయన తెలిపారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

బేతంచెర్ల: పట్టణంలో అనాథగా జీవిస్తున్న నలభైఏళ్ల వ్యక్తి అంబేడ్కర్ విగ్రహం వద్ద మృతి చెందాడు. అనాథ వ్యక్తిగా గుర్తించిన బేతంచెర్ల పోలీసులు అంత్యక్రియలు నిమిత్తం ఆ నల్గురు స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వస్నూర్ బాషాను సంప్రదించారు. స్పందించిన ఆ నల్గురు సభ్యులు అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు నాగేశ్వర్‌రెడ్డి, లక్ష్మీ రాఘవ, యూసుఫ్, అగ్బర్ మాబాషా, రాజు పాల్గొన్నారు.

కోలుకోలేక ఏపీఎం మృతి

బేతంచెర్ల: మండల వైకేపీ కార్యాలయంలో ఏపీఎంగా విధులు నిర్వహిస్తున్న లింగమయ్య గౌడు(52) ఈనెల 1వ తేదీన కర్నూలు పట్టణంలోని ఇంటి బాత్‌రూమ్‌లో కిందపడి తలకు తీవ్రగాయాలయ్యాయి. ఈ మేరకు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం రాత్రి మరణించాడు. ఆయన మృతి పట్ల వెలుగు సీసీలు, బుక్ కీపర్లు, పొదుపు మహిళలు, సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు సంతాపం తెలిపారు.

కొండమీదపల్లె అభివృద్ధికి చర్యలు

కొలిమిగుండ్ల: జనజీవనానికి అందనంత ఎత్తులో ఉన్న కొండమీదపల్లె గ్రామాభివృద్ధికి అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నామని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి చెప్పారు. రోడ్డు విస్తరణ పనులను డీఈ మన్మథరావుతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. ఒక వైపు కొండ,మరో వైపు దిగువ ప్రాంతం ఉండటంతో వర్షాకాలంలో పైనుంచి పెద్ద ఎత్తున వర్షపునీటి ప్రవాహం వల్ల రోడ్డు కోతకు గురికావడంతో పాటు అక్కక్కడ మలుపులతో ప్రజల రాక పోకలు సమయంలో ఇబ్బందులు పడుతుండేవారు. రోడ్డుకు ఆనుకొని ఉన్న కొండను మూడు మీటర్ల మేర ప్రొక్లెయిన్‌తో తొలగించే పనులకు శ్రీకారం చుట్టారు. ఎక్కడెక్కడ ఎలాంటి పనులు చేయాలనే విషయంపై డీఈకి సూచనలు ఇచ్చారు.


రోడ్డు విస్తరణ పనులు పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

డోన్ : పేద, మధ్యతరగతి ప్రజలకు ఆరోగ్య శ్రీ పథకంతో పాటు సీఎం రిలీఫ్ ఫండ్ వరంలా పనిచేస్తోందని ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డిలు తెలిపారు.మండలంలోని చిన్నమల్కాపురం గ్రామానికి చెందిన చాట్ల పక్కీర కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.4లక్షల చెక్కును మంగళవారం ఆయన అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాజేశ్వరరెడ్డి, మాజీ ఎంపీటీసీ బద్దల నాగరాజ్, వైఎస్సార్‌సీపీ నాయకులు మహానందిరెడ్డి, టి.మద్దయ్య, మోకు మద్దయ్య, లక్ష్మన్న, బద్దల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


చెక్కును అందజేస్తున్న ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి

కారు బోల్తా ఒకరికి తీవ్ర గాయాలు

డోన్ టౌన్ : మండల పరిధిలోని ఉడుములపాడు కాశిరెడ్డి నాయన ఆశ్రమ సమీపంలో మంగళవారం ఉదయం కారు అదుపు తప్పి బోల్తా పడడంతో కర్నూలు పట్టణానికి చెందిన దినేష్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. ఇతన్ని చికిత్సల నిమ్మిత్తం డోన్ ప్రభుత్వ వైద్యశాలకు స్థానికులు తరలించగా ప్రథమ చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

బనగానపల్లె రూరల్ : మండలంలోని నందవరం సచివాలయం-1 పరిధిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ శివరామయ్య తెలిపారు. సీనియర్ వైద్యులు, వైద్య సిబ్బంది ఆరోగ్య పరీక్ష చేస్తారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.